

జాతీయ వర్క్‌షాప్‌నకు మంగారాణి ఎంపిక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

నాగరాజా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మోటూరి మంగారాణికి అరుదైన అవకాశం లభించింది. నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్ (ఎన్‌సిఎస్‌ఎల్ -న్యూపా) వారు ఢిల్లీలో నిర్వహించే 'ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించడం కోసం పెడగోగికల్ లీడర్‌షిప్' అనే అంశంపై నిర్వహించే కంటెంట్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌నకు మంగా రాణి ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు ఉత్తర్వులను ఆమెకు గురువారం అందించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మంగారాణి ఒక్కరే ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ వర్క్‌షాప్ ఈ నెల 17 నుంచి 20 వరకు ఢిల్లీలోని ఎన్‌ఎస్‌సిఎల్‌లో జరుగుతుందన్నారు. ఈ సందర్భంగామె అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, అర్బన్ ఎంఇఒ-2 రమా రజని మంగారాణిని అభినందించారు.

అన్నదాతపై బీమా భారం

- ఉచిత పథకానికి ప్రభుత్వం మంగళం
- బీమా సొమ్ము రైతులే చెల్లించాలని ఉత్తర్వులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అన్నదాతలపై కూటమి ప్రభుత్వం మరో భారం మోపింది. పెట్టుబడి సాయంపై ఇప్పటికే మొండి చేయి చూపిన విషయం విదితమే. తాజాగా ఉచిత పంటల బీమా ప్రీమియం ఈ నెలాఖరు నాటికి చెల్లించాలనడంతో రైతులలో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఒక వైపు అప్పులు చేసి సాగు చేస్తున్న పంటలకు కనీస గిట్టుబాటు ధర లేదు. అన్నదాతలపై ఏ మాత్రం కనికరం లేకుండా బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని ప్రభుత్వం తేల్చి చెప్పడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4.50 లక్షల ఎకరాల్లో వరి సాగు ఇతర పంటలు మరో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పైర్లు సాగు చేస్తున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పంటలకు ఈ నెలాఖరులోపు ప్రీమియం ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలని అధికారులు చెబుతున్నారు. వరి రైతులు హెక్టారుకు రూ.168 చొప్పున చెల్లించాల్సి ఉంది. 2024-25 ఆర్థిక ఏడాదికి పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని ఉత్తర్వులలో పేర్కొంది. ఈ నెల 31వ తేదీలోపు వరికి రైతులే స్వయంగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా పథకం అమలు చేసిన విషయం విదితమే. రైతుల నుంచి చెల్లింపులు లేకుండా బీమా కంపెనీలకు ప్రభుత్వమే చెల్లించేది. 2019 నుంచి ఈ క్రాప్ ఆధారంగా అన్ని రకాల పంటలకు చెల్లింపులు జరగటంలో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్న ప్రతిసారీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలలో నష్టపరిహారం నగదు జమ అయ్యేది. దీంతో రైతుకు కొంత మేలు జరిగింది. గత 5 ఏళ్లలో ఉచిత పంటల బీమా పథకం ద్వారా జిల్లా రైతులకు రూ.కోట్ల నగదు ఖాతాల్లో జమ అయింది. ప్రీమియం ఎక్కడ చెల్లించాలో కూడా తెలియడంలేదు. మీ సేవా, బ్యాంకులు, రైతుభరోసా కేంద్రాలు సచివాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారు.



పంటల బీమా గురించి తెలియదు

పంటలకు బీమా గురించి తెలియదు. అధికారులు కూడా ఎవరూ తెలియజేయలేదు. ఎప్పుడు ఎక్కడ చేసుకోవాలో సమాచారం తెలియదు. పంటల బీమా ప్రీమియం సొమ్ము గతంలో మాదిరిగానే ప్రభుత్వమే చెల్లించి రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం ఇప్పటికే పెట్టుబడి సాయం ఇవ్వలేదు. అప్పులు తెచ్చి సాగు చేస్తున్నాం. ఉచిత పంటల బీమా పథకం అయినా అమలు చేయాలి.

- జి.రమేష్ కాతేరు, వరి రైతు.

పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలి

రైతులకు సంబంధించిన పంటల బీమా నగదును ప్రభుత్వం చెల్లిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏటా పంటనష్టం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు భరోసా కల్పించాలి. గతంలో ప్రభుత్వమే చెల్లించడం వల్ల బీమా గురించి తెలియకపోయినా ఇబ్బందులు తలెత్తలేదు. ఆర్థికంగా కొంత ఊరట లభించేది.

- కె.రామారావు, కాతేరు, వరి రైతు.

భూ ఆక్రమణలపై విచారణ చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

జిల్లాలో ల్యాండ్ మాఫియా, భూ ఆక్రమణలపై జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి విచారణ నిర్వహించాలని సిపిఎం డిమాండ్ చేసింది. గురువారం సిపిఎం కార్యాలయంలో రాజమండ్రి నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భూ ఆక్రమణలపై చర్చించి పలు తీర్మాణాలను ఆమోదించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. రాజమహేంద్రవరం నగరంలోని భాస్కర్ నగర్‌లోని 36 ఎకరాలకు సంబంధించిన లే అవుట్‌లో పెద్దఎత్తున భూ ఆక్రమణలు జరిగినట్టు అసెంబ్లీ వేదికగా నగర ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ లేవనెత్తారని అన్నారు. దీంతో పాటు గౌతమి సూపర్ బజార్‌కు సంబంధించిన స్థలం లీజు వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే వార్తలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పేదల, ప్రభుత్వ, సొసైటీల కింద ఉన్న భూములు కబ్జాలకు గురయ్యాయనే వార్తలు పత్రికల్లో వస్తున్నాయని తెలిపారు. గతంలో అధికార యంత్రాంగం సహకారం లేకుండా ఇంత పెద్దఎత్తున భూములు ఆక్రమణలకు అవకాశం ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని తీసుకొస్తామని చెబుతుందని, ఆ చట్టం పేరుతో గతంలో పేదలు సెంటు, అరసెంటులో ఇళ్లు నిర్మించుకుంటే వాటిని స్వాధీనం చేసుకునే ఎత్తుగడ తప్ప ఇంకోటి కాదన్నారు. వాస్తవంగా భూ ఆక్రమణదారులు ఎవరైతే ఉన్నారో వాళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం నగరంలోని ఎఇఎల్‌సి, ఇతర మిషనరీల భూములు ఆక్రమణలకు గురయ్యాయని పాస్టర్లు రోడ్డు మీదకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారని గుర్తు చేశారు. కావున రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి విచారణ చేపట్టి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆక్రమణలపై అఖిలపక్షం సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించి నివేదికను ప్రభుత్వానికి అందివ్వాలని ఆయన కోరారు. భూ ఆక్రమణలపై విచారణను లోతుగా చేసి, అందుకు పాల్పడిన ప్రభుత్వ శాఖ అధికారులు, యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని కోరారు. భాస్కర్ నగర్ భూ ఆక్రమణలపై సిపిఎం నిజనిర్ధారణ కమిటీ క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తుందన్నారు. దీనిపై రానున్న కాలంలో భూ ఆక్రమణలపై పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపట్టేందుకు సన్నద్ధం అవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు కెఎస్‌వి.రామచంద్రరావు, ఎస్‌ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత అరుణ్

సువర్ణవేణికి గద్దర్ జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-కడియం

కడియం జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయిని డాక్టర్ బూసి సువర్ణవేణికి గద్దర్ జాతీయ సేవా పురస్కారం దక్కింది. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా, మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలోని సాయి తేజ జూనియర్ కళాశాలలో గురువారం పురస్కారాలు ఉత్సవం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి, ఛైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ (ప్రజాకవి గద్దర్ కుమార్తె) ద్వారా పురస్కారాన్ని సువర్ణ వేణి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌ఎ పాముల రాజేశ్వరి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సువర్ణవేణి

జేగురుపాడులో సేంద్రియ కూరల సాగు

ప్రజాశక్తి-కడియం

ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పలువురి ప్రశంసలు అందుకున్న జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ మరోసారి పలువురు సర్పంచుల చూపును తన గ్రామం వైపు తిప్పుకునే విధంగా చేశారు. గ్రామంలో అనేక ప్రాయోజత కార్యక్రమాలు చేపట్టి, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ప్రాంగణంలో గల ఖాళీ స్థలంలో సేంద్రియ ఎరువుతో ఆకు కూరలు సాగు చేస్తున్నారు. అధిక మొత్తంలో ప్రోటీన్స్ గల గోంగూర, తోటకూర, పాలకూర, కొత్తిమీర తదితర ఆకుకూరలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలిచారు సర్పంచ్ స్టాలిన్. ప్రతిరోజూ ఉదయమే 6 గంటలకు సంపద కేంద్రానికి వెళ్లి ఆకుకూరల మడులను, పండ్ల మొక్కల పెంపకం గూర్చి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఆకుకూరలు ఎంతో ఆరోగ్యానికి శ్రేష్టమైనవని తెలియజేస్తున్నారు. ఈ కేంద్రాన్ని ఇటీవల ట్రైనీ కలెక్టర్ల బృందం సందర్శించింది.



ఆకు కూరలకు నీరు పోస్తున్న సర్పంచ్

ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కడియం

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ తరపున ఈ నెల 14న రాజమహేంద్రవరం జెఎన్ రోడ్డులోని జెకె గార్డెన్స్‌లో తలపెట్టిన మహాసభకు జిల్లా ఉద్యోగులు అందరూ హాజరవ్వాలని ఉద్యోగ మహాసభ కన్వీనర్ సిహెచ్‌ఎస్.విల్సన్ పాల్ పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లాలోని ఏడుగురు ఎంఎల్‌ఎలు, రుడా ఛైర్మన్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ తదితర జిల్లా అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని, సుమారు రూ.3 వేల మంది ఉద్యోగులు హాజరు కానున్నారని తెలిపారు. 56 శాఖల కలయికతో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కుమార్, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు. కొంతకాలంగా ఉద్యోగుల సమస్యలు పేరుకుపోయి అపరిష్కృతంగా ఉన్నాయని, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలు పరిష్కరించడమే ఈ మహాసభ ముఖ్య ఉద్దేశమని విల్సన్ పాల్ తెలిపారు.



భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న సభ్యులు

మంచు పల్లకి భవనం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-గోకవరం

కొత్తపల్లిలో కొత్తపల్లి ఆర్య వైశ్య సంఘ సేవా విభాగంలో జగ్గంపేట మాజీ మార్కెట్ యార్డ్ కమిటీ అధ్యక్షుడు జనపరెడ్డి సుబ్బారావు ఆర్థిక సాయంతో నిర్మించిన మంచు పల్లకి భవనాన్ని గురువారం కొత్తపల్లి ఆర్య వైశ్య సంఘ గౌరవ అధ్యక్షులు ప్రగళ్ళపాటి బాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం కొత్తపల్లి వైశ్య కుటుంబాలలో ఎవరైనా మరణిస్తే, వారి దహన సంస్కారాలు నిర్వహణకు సామగ్రి అంతా ఉచితంగా సరఫరా చేసి, ఆ దహన సంస్కార కార్యక్రమం పూర్తయ్యే వరకూ అవసరమైన సేవ ఈ సభ్యులు నిర్వహిస్తారన్నారు. భవిష్యత్తులో ఈ సేవ అందరికీఅందుబాటులోకి తీసుకు వచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కళ్యాణ చక్రవర్తి, సాయి, సురేష్, సుధీర్, సూర్యచంద్ర, లింగరాజు, భద్రాద్రి, ప్రకాష్, ఆదినారాయణ, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

జిల్లా ప్రగతిపై సిఎంకు కలెక్టర్ వివరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వెలగపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సదస్సులో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగాకలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాల్లో రైతులకు దిగుబడి తక్కువగా వస్తున్నట్లు తెలిపారు. ఆయా భూముల్లో పిహెచ్ శాతం తగ్గడం వల్ల, ఏటా దిగుబడి తగ్గుతున్న దృష్ట్యా భూ యజమానులు ఆక్వా సాగు చేసేందుకు ల్యాండ్ కన్వర్షన్ కోసం కోరుతున్నట్టు తెలిపారు. ఆక్వా కల్చర్ అభివృద్ధి సామర్థ్య రంగాల్లో ప్రభుత్వ పరంగా చేయూత నివ్వడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. అదే ప్రవేటు పరంగా సహకారం కోరే వ్యక్తులు, సంస్థలు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు డిమాండ్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పరంగా చేయూత నివ్వడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చగలుగుతామన్నారు. ఆ దిశలో యువతలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు అకడమిక్ బోధనతో పాటు నైపుణ్య శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో రెండు మూడు బ్యాచ్‌లను తయారు చేయడం ద్వారా ఉభయ గోదావరి జిల్లాల నుంచి వస్తున్న డిమాండ్‌ను అనుసరించి నైపుణ్యం గల వ్యక్తులను అందుబాటులోకి తీసుకుని రావడం సాధ్యం అవుతుందని కలెక్టర్ ప్రశాంతి వివరించారు. ఇందుకు సమాంతరంగా ఆక్వా కల్చర్‌కు తగిన అంతర్జాతీయ మార్కెటింగ్ ప్రోత్సాహం అందించడానికి, ధరల స్థిరీకరణ విధానంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా రొయ్యల ఉత్పత్తుల వినియోగంపై దృష్టి సారించడం వల్ల ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. రానున్న 2027 గోదావరి పుష్కరాలు నేపథ్యంలో జిల్లాలో ప్రతిపాదించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు కల్పించడం తదితర అంశాలపై కలెక్టర్ వివరించారు. శ్రీ సత్యసాయి బాబా ట్రస్టు అధ్వర్యంలో నిర్వహిస్తున్న తాళ్లపూడి మండలానికి తాగునీటి సరఫరా చేసే సత్యసాయి ట్రస్టు సిబ్బందికి వేతనాలు చెల్లింపు, పిఎఫ్ తదితర అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వచ్చినట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పలు మెట్ట ప్రాంత మండలాలకు రెండు దశబ్దాలుగా తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. సకాలంలో 2021 నుంచి జీతాలు చెల్లింపు జరగ పోవడం వల్ల సిబ్బంది సమ్మె దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. సిబ్బంది విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధుల విడుదల చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి




శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

గెడ్డం శివ సేవాతత్పరత ప్రశంసనీయం

ప్రజాశక్తి-కడియం

రక్తదాత, చిరు సేవాసమితి అధ్యక్షుడు గెడ్డం శివ పరిచయం అక్కర్లేని సామాజిక సేవకుడని పలువురు ప్రశంసించారు. బుర్రిలంకకు చెందిన శివ పుట్టినరోజు సందర్భంగా శివ మిత్ర బృందం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని ధన్వంతరీ బ్లడ్ బ్యాంక్‌లో అధిక సంఖ్యలో యువకులు పాల్గొని రక్తదానం చేశారు. క్రమం తప్పకుండా ఏటా పుట్టినరోజునే కాకుండా అవసరమైన పలు సందర్భాల్లో బ్లడ్ బ్యాంక్‌కు సహకరిస్తూ, రక్తదాతలను సమాకుర్చుతున్న గెడ్డం శివ అభినందనీయులని నిర్వాహకులు ప్రశంసించారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాతల సమక్షంలో కేక్ కట్ చేసి అభిమానాన్ని చాటారు. రాజమహేంద్రవరంలోని ప్రియదర్శిని చెవిటి, మూగ, అనాథాశ్రమం చిన్నారులకు భోజనాలు ఏర్పాటు చేసిన మిత్ర బృందం సభ్యులు పలురకాల పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి చిన్నారులచే కేక్ కట్ చేయించి పంచారు. పలు పాఠశాలల ప్రాంగణల్లో మొక్కలు నాటారు. సేవకు చిరునామాగా నిలుస్తున్న శివ మిత్ర బృంద సభ్యులను అనాథాశ్రమ నిర్వాహకులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'



భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

గ్రామాల్లోని భూముల సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు తోడ్పాటు అందిస్తాయని పలువురు అధికారులు తెలిపారు. గురువారం జిల్లాలోని పలుచోట్ల రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో పంచాయతీ వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో భూముల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక ప్రభుత్వ స్థలాలను, ప్రైవేటు స్థలాలను కబ్జా చేశారని, వాటన్నిటినీ ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా గుర్తించి అర్హులకు న్యాయం చేస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన అర్జీలలో పరిష్కరించదగినవి వెంటనే పరిష్కరిస్తామన్నారు. తక్షణమే పరిష్కరించలేనివి పరిశీలించి 45 రోజుల్లో తప్పక పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి, టిడిపి మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, ప్రత్యేకాధికారి జ్యోతి, తహశీల్దారు కుమార్ బాబు, బిక్కిన సాంబశివరావు, గంగిన తిరుమల రావు, గంగిన నాని, గంగిన జాహ్నవి పాల్గొన్నారు.

కోరుకొండ జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మండలంలోని దోసకాయలపల్లిలో రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో జెసి మాట్లాడారు. 22 ఎ యాక్ట్‌లో రైతులకు సంబంధించిన భూములు ఉంటే ఈ రెవెన్యూ సదస్సులో అర్జీ చేసుకోవడం వల్ల సమస్యకు పరిష్కారమవుతుందన్నారు. రైతులు తమ భూముల వివరాలను పరిశీలించుకోవాలని, రెవెన్యూ రికార్డులలో తప్పుగా నమోదైనా ఈ సదస్సులలో సరిచేసుకోవచ్చన్నారు. భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సు చక్కటి వేదికన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్‌డిఒ కృష్ణ నాయక్, తహశీల్దారు సుస్వాగతం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పద్మావతి, పలువు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గోకవరం గత వైసిపి హయాంలో చోటు చేసుకున్న భూ అవకతవకల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్టు టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. గురువారం కృష్ణునిపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ.. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారని తెలిపారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అధికారులు గ్రామాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో భూ ఆక్రమణలతో అమాయక ప్రజలు రైతులు చాలా ఇబ్బంది పడ్డారని, వాటిని పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశంగా కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు మాట్లాడుతూ కృష్ణునిపాలెం రెవెన్యూ సర్వే నెంబర్-1లో పోడు భూములను సాగు చేసుకుని రైతులు తోటలు పెంచారని, వాటికి పట్టాలను ఇప్పించవలసిందిగా కోరారు. వైసిపి ప్రభుత్వంలో నివాస యోగ్యంకాని ఇళ్ల స్థలాలు కేటాయించారని, ప్రజలు ఇళ్ల పట్టాలను తిరిగి అధికారులకు అప్పగించారని, ఊరికి దగ్గరకు అనువైన ప్రదేశంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందిగా నవీన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సాయి ప్రసాద్, ఎంపిడిఒ గోవింద్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ఉంగరాల రాము, అడపా భరత్ కుమార్, మాజీ సొసైటీ ఛైర్మన్ దాసరి తమ్మన్నదొర, మాజీ జెడ్‌పిటిసి పాలూరి బోసు బాబు, తంటికొండ దేవస్థానం మాజీ ఛైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర, మలిరెడ్డి సిరి, బదిరెడ్డి రవి, గెడ్డం బాబు, మండిగ బాలాజీ, మండిగ గంగాధర్, గుండా శివప్రసాద్, కొంగరపు రాజు, అల్లాడ అరుణ, బోలగుండ రాజారెడ్డి, మండిగ శ్రీనివాస్, గొర్రిపూడి పోసిబాబు, సిద్ధ సురేష్, అమరా దొర, దిబ్బ శ్రీను, మిరప పండు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం రైతులు తమ వ్యవసాయ భూములకు సంబంధించి, రీ సర్వే ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఉండ్రాజవరం తహసీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని మొదటి రోజు రెవెన్యూ సదస్సులు నిర్వహణలో వెలగదుర్రు, దమ్మెన్ను గ్రామాల్లో ఆయన పాల్గొని రైతులకు పలు సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ, రవీంద్రరాజు, ఇరు గ్రామాలలోని కూటమి నాయకులు, రైతులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు దారవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలను బాధితుల నుంచి అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ మద్దుకూరి రవి ప్రసాద్, టిడిపి నాయకులు నాదల శ్రీరామ్ చౌదరి, బొడ్డు రాజు, కేశవ, తహశీల్దారు ఎం.మేరీకమ్మ పాల్గొన్నారు.



కోరుకొండ సదస్సులో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు



చాగల్లులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు



గోకవరంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్ కుమార్



కాతేరులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి

నేరాలు ఘోరాలు



దాడిపై ఫిర్యాదు చేస్తున్న కోనపాపేట గ్రామస్తులు

దాడి చేశారని బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

తమపై జనసేన నాయకులు దాడి చేశారని గురువారం కోనపాపపేట గ్రామస్తులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్ర తీరంలో వేసిన పైప్‌లైన్లు తొలగించాలని మత్స్యకారులంతా ఆందోళన చేస్తున్నామని, అయితే కొందరు జనసేన నాయకులు అరబిందో యాజమాన్యంతో కుమ్మక్కై డబ్బులు తీసుకున్నారని, ఇదే అంశంపై గురువారం గ్రామంలోని రామాలయం వద్ద గురువారం ఉదయం చొక్కా పేతురు, చొక్కా ప్రకాష్‌లు జనసేన పార్టీకి చెందిన నాయకులు పల్లేటి బాపన్న దొర, నాగేశ్వరరావు, శ్రీను, దారకొండ, రాజు, మరికొందరు నిలదీశారని అన్నారు. దీంతో వారు తమపై దాడి చేసి గాయపర్చారని, బాధితులను కాకినాడకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. జనసేన నాయకులు గుండాలుగా ప్రవర్తిస్తున్నారని, వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ బాధితులు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సిఐ శ్రీనివాస్

దాడి కేసులో ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులపై దాడికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ రాత్రి 11.30గంటల సమయంలో ఇద్దరి వ్యక్తులు మద్యం తాగి వసతి గృహంలో చొరబడ్డారు. 8, 9, 10 తరగతి చదివే విద్యార్థులు గదుల్లోకి వెళ్ళి వారిని భయభ్రాంతులకు గురి చేసి, బీరు బాటిళ్లు పగలగొట్టి వారిని చంపుతానని బెదిరించి రూ.540 లాక్కునిపోయారన్నారు. విషయం తెలుసుకున్న వార్డెన్ వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. తమ విచారణలో రథాలపేటకు చెందిన గంగాధర్, కుమారపురానికి చెందిన దయానంద్ ఈ దాడికి పాల్పడ్డారని, వారిద్దరని అరెస్టు చేసినట్లు తెలిపారు. అవసరమైతే అటువంటి వ్యక్తులను అరెస్టు చేసి రౌడీషీట్లు తెరుస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి - శంఖవరం

మద్యం తాగి వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు జైలు శిక్ష పడినట్లు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం ప్రత్తిపాడు వైపు నుంచి అన్నవరం వస్తున్న లారీని ఆపి డ్రైవర్‌ను బ్రీతింగ్ ఎనలైజర్‌తో తనిఖీ చేశారు. మద్యం తాగినట్లు నిర్ధారణ కావడంతో ప్రత్తిపాడు కోర్టులో డ్రైవర్‌ను హాజరు పరిచగా న్యాయమూర్తి 15 రోజులు జైలు శిక్ష విధించారని తెలిపారు.



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తూర్పుపాకలు గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- గోకవరం

పురుగుల మందు తాగి వ్యక్తి మతి చెందిన సంఘటన గోకవరంలో చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం మండల కేంద్రమైన గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన కాళ్ల మల్లి రాజు (30) కుటుంబ కలహాల కారణంగా గురువారం తెల్లవారుజామున తన ఇంటి వద్ద ఉన్న పురుగు మందు తాగాడన్నారు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలని రిఫర్ చేశారన్నారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి ప్రైవేటు వాహనంలో తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడాన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఆగ్రహించి గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మల్లి రాజు మతి చెందాడని ఆసుపత్రి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి ఆసుపత్రికి వచ్చి పోలీసులతో చర్చించారు. మృతుని చావుకి కారణమైన పరిస్థితులను సిసి ఫుటేజ్ ద్వారా తెలుసుకొని దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

యానాం వార్తలు



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పేద ప్రజలకు నష్టపరిహారం చెల్లించాల్సిందే...

ప్రజాశక్తి - యానాం

రిలయన్స్, ఒఎన్‌జిసి సంస్థల నుంచి మత్స్యకారులకు ఇస్తున్న పరిహారం మాదిరిగా అర్హులైన అన్ని వర్గాల పేద ప్రజలకు పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ నాయకులు ములగపాటి ప్రసాద రాజు, దున్నా చక్రవర్తి, చీకట్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చమురు సంస్థల వల్ల అన్ని వర్గాల ప్రజలకు నష్టం కలిగినప్పటికీ ఎటువంటి పరిహారం చెల్లించడం లేదన్నారు. ఎస్‌సి భూములలో చమురు సంస్థల పనులు చేపట్టిన నామమాత్రంగా నష్ట పరిహారం చెల్లించడం తప్ప ఏ ఒక్క ఎస్‌సి రైతుకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించడం లేదన్నారు. గ్రామాల అభివృద్ధికి గానీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు గాని అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్న నాయకులు సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. 5229 మంది మత్స్యకారులకు మాత్రమే ఈ పరిహారం చెల్లిస్తున్నారని అన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, 643 డ్వాక్రా గ్రూపులకు కుట్టు మిషన్లు, గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. పారిశుధ్యకార్మికులకు డ్రెస్ కోడ్, మెడికల్ కిట్లు ఇవ్వాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఆయా సంస్థలే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

చదరంగం న్యాయ నిర్ణేతల పరీక్షలో ప్రతిభ

ప్రజాశక్తి - యానాం

రాజమహేంద్రవరంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సీనియర్ నేషనల్ చదరంగం న్యాయ నిర్ణేతలు పరీక్షలో యానాం ప్రాంతానికి చెందిన ఓలేటి తేజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సుమారు 73 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కాగా అందులో 21 మంది ఉత్తీర్ణులు అయ్యారు. పుదుచ్చేరి స్థాయిలో యానాం నుంచి పాల్గొని 4వ స్థానంలో నిలిచారు. పరీక్షలలో ప్రతిభ చాటిన తేజని యానాం పెద్దిరెడ్డి కాలనీకి చెందిన గ్రామస్తులు అభినందించారు.

బాధితులకు రూ.5 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

ఫెంగల్ తుపానుకు తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు పుదుచ్చేరి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ మేరకు గురువారం యానాం నియోజకవర్గంలో (ఎపిఎల్, బిపిఎల్) ప్రతి రేషన్ కార్డు దారులకు రూ.5 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ కాకపోతే ఎంఎల్ఎ కార్యాలయాన్ని గాని, సంబంధిత అధికారులను గాని సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా యానాం ప్రజల తరపున కూటమి ప్రభుత్వ నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న మల్లాడి కృష్ణారావు

పలువురి కుటుంబాలకు మల్లాడి పరామర్శ

ప్రజాశక్తి - యానాం

ఇటీవల కాలంలో మృతి చెందిన, ఇతర సమస్యలతో బాధపడుతున్న పలువురి కుటుంబాలను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం పరామర్శించారు. స్థానిక కనకాల పేటలో అనారోగ్యంతో మృతి చెందిన ఐఆర్ బి కానిస్టేబుల్ కనకాల లోవరాజు మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కోన వెంకన్నబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన కనకాల లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను మల్లాడి పరామర్శించారు.

రాజగోపాల్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

ఎపిటిఎఫ్(257) రాష్ట్ర పూర్వ కార్యదర్శి, ఉంగ్రాజవరం మండలం, సూర్యారావు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు అయినపర్తి రాజగోపాల్(66) గురువారం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజగోపాల్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన మరణం ఎపిటిఎఫ్‌కు తీవ్ర లోటు అన్నారు. రాజగోపాల్ ఆకస్మిక ఆయన అంత్య క్రియలు శుక్రవారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పలు ఆలయాల్లో హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాల్లో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కింపు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని హుండీల ఆదాయాన్ని లెక్కించారు.

ఆత్రేయపురం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి హుండీల ఆదాయాన్ని గురువారం ఆలయ ముఖ మండపంలో జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి సత్యనారాయణ పర్యవేక్షణలో 37 రోజులుగాను లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.1,38, 49,477 నగదుతో పాటూ 31 గ్రాముల బంగారం, 990 గ్రాముల వెండి, పలు దేశాల విదేశీ కరెన్సీ సమకూరయని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్ల చక్రధర్ రావు తెలిపారు. అలాగే క్షేత్రపాలకుడు విశ్వేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ.3,84, 774 వచ్చాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానము సిబ్బంది పాల్గొన్నారు.**రామచంద్రపురం**: ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల గురువారం లెక్కించారు.. 26 సెప్టెంబర్ నుంచి 12 డిసెంబర్ వరకు 78 రోజులకు గాను ఆలయ హుండీల ద్వారా ఆదాయం రూ. 56,01,095లు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ తెలిపారు. గత ఏడాది రూ.34 లక్షల 66 వేలు ఆదాయం లభించగా. ఈ ఏడాది మరో రూ.20 లక్షలు అవనంగా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. దీనితో పటుగా బంగారం 94.100 గ్రాములు, వెండి 552 గ్రాములు, అన్నదానం హుండీల ద్వారా ఆదాయం రూ.1,09,670 లు వచ్చినదని దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రాంప్రసాద్, అర్చకులు, సేవా సిబ్బంది, యాత్రికులు ముప్పనపల్లి గణేష్ వెంకన్న బాబు, రామకష్ణ సాంబశివరావు, రామకష్ణ ఆళ్ల బుజ్జి , నవీన్ పాల్గొన్నారు.**మామిడికుదురు:** అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ హుండీల ఆదాయం 42 రోజులకు రూ.33,35,485 సమకూ నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు గురువారం దేవదాయశాఖ తనిఖీదారు ఎ.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో స్వామి వారి హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన హుండీల నుండి రూ.33,05,282, అన్నప్రసాదం హుండీల నుంచి రూ.30,203 మొత్తం రూ.33,35,485 ఆదాయం వచ్చిందన్నారు.

అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం, చాగల్లు. గోపాలపురం

ప్రజారోగ్యం, పరిపూర్ణ పారిశుద్యం, తాగునీరు అందించేందుకు పటిష్టమైన, క్లోరినేషన్‌పై మెలుకువలు ఒడిఎఫ్ ప్లస్, ఎస్‌డబ్ల్యు ఎంపిసిల ద్వారా చెత్తనుండి సంపద, వంటి పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు మండల స్థాయి శిక్షణా తరగతులను గురువారం, ఎంపిడిఒ, వివివిఎస్.రామారావు అధ్యక్షతన నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా తరగతులను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, కెవి.శర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఇ.దుర్గాభవాని, ఎంఇఒ శారదా జ్యోత్స్న, సిహెచ్‌ఒ ఎం.సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు బాల సరస్వతి, భాగ్యలక్ష్మి, ఎంఆర్‌సి, కె.ప్రకాష్, మండల డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, మహిళా పోలీస్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎంపిడిఒ ఆర్.దేవి అధ్యక్షత వహించగా డిపిఆర్‌సి ఏలూరులో శిక్షణ పొందిన ఎపిఎం ఇ.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కె.తిలక్, ఎంపిహెచ్‌ఒ శాస్త్రి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాముఖ్యత, వాటి సాధనకు అవసరమైన చర్యలు, ప్రభుత్వ పథకాలు, పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, విద్య, స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ మొదలైన అంశాలపై సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ప్రజలు, అధికారులు భాగస్వామ్యులు అవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం 2030 నాటికి పేదరికం రూపుమాపడానికి, అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి టి.శ్రీనివాసరావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. గోపాలపురం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచులకు, మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బందికి 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగి రాజు, సామర్లకోట ఇటిసి కోర్స్ డైరెక్టర్ చక్రపాణి, ఎంపిడిఒ బిఎస్ఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. 2030 నాటికి అన్ని గ్రామాల అభివృద్ధికి పేదరిక నిర్మూలన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల ఖర్చు చేస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీల ఈ మేరకు ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. 2030 నాటికి స్థానిక ప్రభుత్వాలు సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం నాలుగు రోజులు పాటు జరగనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్‌లో 89 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎపిఎం పి.రోజామాణిక్యం, ఎఒ బి.రాజారావు, పిఆర్ఎ ఇ.బంగారయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయ, సర్పంచులు, పాల్గొన్నారు.



గోపాలపురం సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

'శ్రీనివాస'లో డ్రోన్ పైలెట్ల శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాసా అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో అకిన్ అనలిటిక్స్ సంస్థ డ్రోన్ పైలెట్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించింది. భద్రత, అర్హతా ప్రమాణాల్ని తనిఖీ చేసెందుకు ఢిల్లీ నుంచి డైరక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ బృందం విచ్చేసింది. కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రోన్ పైలట్ శిక్షణ కేంద్రం లో మౌలిక సదుపాయాలు, సాంకేతిక నిర్వ హణ వంటి అంశాలను పరిశీలించింది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన సమా వేశంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎస్ఎస్.వర్మ మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న దశలో డ్రోన్ ఆవశ్యకత అన్ని రంగాల్లో పెరిగిందన్నారు. ముఖ్యంగా వ్యవ సాయరంగంలో పంటకు ఎరువులు, పురుగు మందులు వంటివి పిచికారీ చేయ డానికి ఉపయోగపడు తున్నాయన్నారు. ప్రిన్సిపల్, సభాధ్యక్షులు డాక్టర్ ఎం.శ్రీనివాస కుమార్ డ్రోన్ ఆవశ్యక తను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ సభ్యులు సందీప్, వివిధ విభా గాల డీన్స్ అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీ ఆర్చరీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీయట్ ఆర్చరీ మెన్ అండ్ ఉమెన్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌ను నిర్వహించారు. యూనివర్సిటీలో పోటీలకు ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌ఛార్జి సెక్రటరీ ఆచార్య జి.సుధాకర్ గురువారం హాజరై బాణం సంధించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువిద్యను ప్రోత్సహించడంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం చేస్తున్న కృషిని ప్రశంసించారు. గతంలో కంటే ఎక్కువ మంది ప్రతిభవంతులైన క్రీడాకారులు విలువిద్య పోటీలకు హాజరు కావడం హర్షణీయమన్నారు. ఏకలవ్యను మాదిరిగా ఏకాగ్రతతో లక్ష్యాలను ఛేదించాలని సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల నుంచి మెన్ అండ్ ఉమెన్ అభ్యర్థులు 40 మంది హాజరై తమ ప్రతిభను కనపరిచారు. ఇండియన్ రౌండ్ ఆర్చరీ విధానంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభావంతులైన ఎనిమిది మందిని విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారు. వీరు ఈ నెల 22 నుంచి 26 వరకు భువనేశ్వర్‌లోనికిట్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు, సెక్రటరీలు వి.సాల్మన్ దేవానంద్, అబ్జర్వర్ డాక్టర్ సివి.సుబ్రహ్మణ్యం, సెలక్షన్ కమిటీ మెంబర్స్ ఆలీ, విజయ్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ఆర్.సాంబశివరావు, డాక్టర్ బి.రామ్ గోపాల్, డాక్టర్ బాలసత్యనారాయణ, విశ్రాంత ఎంఇఒ జెఎన్ఎస్.గోపాలకృష్ణ, టి.లక్ష్మణ్, డాక్టర్ సుధారాణి పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ జి.సుధాకర్

ఐఎంఎల్ డిపోలో ఎక్సైజ్ కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి-చాగల్లు

ఐఎంఎల్ డిపోను జిల్లా ఎక్సైజ్ శాఖ కమిషనర్ చైతన్య మురళి గురువారం తనిఖీ చేశారు. సరుకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిపోలో సరుకు నిలవ కోసం అదనంగా షెడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. డిపో పరిధిలో 111 షాపులు ఉన్నాయన్నారు. వాటి నిర్వహణ పనితీరును సక్రంగా ఉండేలా షాపులను, స్టేషన్లను పరిశీలిస్తున్నట్లు అని తెలిపారు. డిపో మేనేజర్ రామకృష్ణదాసు, డిపోలో పనిచేసే హమాలీలతో మాట్లాడారు.

తొలిరోజు 23 రెవెన్యూ సదస్సుల నిర్వహణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో గురువారం 23 రెవెన్యూ సదస్సులు నిర్వహించామని జెసి ఎస్.చిన్నరాముడు తెలిపారు. గురువారం కోరుకొండ మండలం దోసకాయపల్లిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి చిన్న రాముడు మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి జిల్లా వ్యాప్తంగా 272 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధిలో డిసెంబర్ 12 నుంచి జనవరి 8 వరకు గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు జిల్లాలో 23 గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించి 386 అర్జీలను స్వీకరించామన్నారు. రాజమండ్రి డివిజన్‌లో 149, కొవ్వూరు డివిజన్‌లో 237 అర్జీలు స్వీకరించామన్నారు. 33 రోజుల్లోగా అర్జీలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో పరిష్కారం కోసం వచ్చే అర్జీ దారులు అధికారులకు తగిన పత్రాలు అందించాలన్నారు. భూ సంబంధ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు చక్కని వేదికలన్నారు. గురువారం మండల పరిధిలో ఒక రెవిన్యూ సదస్సు నిర్వహించామన్నారు. అందులో 21 మంది అర్జీలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, రెవిన్యూ సిబ్బంది , రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ సలహాదారు సూర్యనారాయణ మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు ఉప్పలగుప్తంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చిక్కం సూర్యనారాయణ గురువారం మృతి చెందారు. ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసి వేలాదిమంది విద్యార్థుల ను ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం అమలాపురం తాలూకా పెన్షనర్స్ యూనిట్ ఏర్పాటు చేయడంలో, పెన్షనర్స్ భవన్ నిర్మాణంలోనూ సూర్యనారాయణ కీలకంగా వ్యవహరించారు. అమలాపురం యూనిట్ జిల్లా బ్రాంచ్‌గా అప్ గ్రేడ్ చేయడంలో సూర్యనారాయణ ప్రధాన పాత్ర పోషించారు. సూర్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సూర్యనారాయణ మృతిపై పెన్షనర్స్ అసోసియేషన్, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ప్రజాశక్తి-గోపాలపురం

నేడు గోపాలపురం సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ డి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు ఆదేశాల మేరకు సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కెవి ఇండస్ట్రియల్ ఫీడర్ ట్రీ కటింగ్, ఆర్‌డిఎస్ వర్క్ నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గోపాలపురం సబ్ స్టేషన్ పరిధిలోని భీమోలు, గుడ్డిగూడెం, నందిగూడెం, గోపాలపురం గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ ఫీడర్ మీద ఉన్న వినియోగదారుల విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, కావున ఇండస్ట్రియల్ నియోగదారులు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

15న మహా దన్ను సభ

ప్రజాశక్తి-చాగల్లు

ఈ నెల 15న మహా దన్ను సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర శెట్టిబలిజ అభివృద్ధి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు తెలిపారు. బుధవారం రాత్రి చాగల్లు వచ్చిన ఆయనకు మండలంలోని సంఘం నాయకులు ఆహ్వానం పలికారు. ఈ నెల 15న రాజమహేంద్రవరంలో లాలాచెరువు వద్ద శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన, యాత మహా దన్ను సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ, రాజమండ్రి సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసుకు అభినందన కార్యక్రమం, శెట్టిబలిజ కార్పొరేషన్ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరుగుతాయన్నారు. సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.